**నీలగిరి నిత్యపద్యం**
సమస్యాపూరణం
**ఆటవెలది**

చదువు సంధ్య లేక సంస్కారమును వీడి
కానిపనులు చేసి హానిచేయు
కుర్రకారుల గని కుమిలిపోయి తుదకు
(వాణి యేడ్చుచుండె వీణ విడిచి)

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**


తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 337 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 02-04 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

- మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు
- భారత వాతావరణశాఖ హెచ్చరిక



హైదరాబాద్,

రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం,

-మిగతా 2 లో

## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

- 30వేల మంది టెక్కీల తొలగింపు
- అందులో 12వేమంది భారతియులు




న్యూయార్క్

అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది

-మిగతా 2 లో



## లోక్‌సభ స్థానాల పెంపుపై మోదీ సర్కారు 'బుల్డోజింగ్' యత్నం

- ఏ లెక్కన 50 శాతం చొప్పున పెంచుతారు..?
- ఇది దక్షిణాదికి నష్టం చేయడమే
- ఆ ముప్పుపై ముందే హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

న్యూఢిల్లీ,

ఏ లెక్క ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం ఏ లెక్కన పెంచుతారని మోదీ ప్రభుత్వాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'ఇది ముమ్మాటికీ దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేయడమే. రాబోయే ముప్పు గురించి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు' అని బుధవారం ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. 'లోక్‌సభ పరిమాణాన్నీ ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్ల సంఖ్యనూ 50 శాతం పెంచేందుకు మోదీ ప్రభుత్వం ఒక బిల్లును 'బుల్‌దోజ్' (బలవంతంగా రుద్దడం) చేయాలని ప్రతిపాదిస్తోంది. ఇటువంటి చర్య దక్షిణాదితోపాటు ఈశాన్య, పశ్చిమ భారత్‌లోని చిన్న రాష్ట్రాలకు 'ప్రతికూలంగా' మారుతుంది. ఈ విషయమై విపక్షాల

-మిగతా 2 లో

### తెలంగాణను దోచుకుంటున్న

# కాంగ్రెస్

### ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరుతో దోపిడీ

- ప్రజల పోరాటాన్ని నవ్వులపాలు చేసేలా పాలన
- రెండు రాష్ట్రాలను అన్నదమ్ముల్లా అభివృద్ధి చేసుకోవాలి
- అమరావతి అద్భుత రాజధానిగా అభివృద్ధి చెందాలి
- లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, :

తెలంగాణను పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరుతో దోచుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్న లక్ష్యం నెరవేరడంలేదని, ప్రజల పోరాటాన్ని నవ్వులపాలు చేసేలా కాంగ్రెస్ పాలన సాగుతోందని అన్నారు. బుధవారం లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు–2026పై చర్చ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పాటవుతున్న సందర్భంగా.. తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన ఆ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు

-మిగతా 2 లో



### లక్నోపై ఢిల్లీ క్యాపిటల్స్

## సూపర్ విక్టరీ

- అజేయ హాఫ్ సెంచరీతో సమీర్ రిజ్వీ షో
- ఓడిపోయే స్థితి నుంచి మ్యాచ్ గెలిచిన ఢిల్లీ

న్యూఢీల్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన తమ తొలి మ్యాచులో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఢిల్లీ.. ఆరు వికెట్ల తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ ఫలితంతో ఐపీఎల్ 2026ను విజయంతో ఆరంభించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 141 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి మ్యాచ్ ముగించింది.లక్నో వేదికగా జరిగిన ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో తీవ్రంగా తడబడింది. ఓపెనర్‌గా వచ్చిన పంత్ (7)తో పాటు మిగతా బ్యాటర్లు కూడా విఫలమయ్యారు. దీంతో కనీసం 20 ఓవర్లు

-మిగతా 2 లో



## కేంద్రం మరో షాక్

- భారీగా పెరిగిన వాణిజ్య సిలిండర్ ధరలు
- రూ.195.50 మేర పెరుగుదల
- జెట్ ఫ్యూయెల్ ధరలు రెట్టింపు

న్యూఢిల్లీ

దేశంలో వంటగ్యాస్ కొరత ఇప్పటికీ ఉంది. ఇది చిన్న హౌటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లపై తీ ప్రభావాన్ని చూపుతోంది. కేంద్రంలో దేశంలో వంటగ్యాస్ కొరత లేదని చెప్తున్నప్పటికీ.. పరిస్థితులు మాత్రం విరుద్ధంగా ఉన్నాయి. దేశంలోని ప్రజలు, చిన్నవ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కేంద్రంలోని మోడీ సర్కారు మరో షాక్ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులను కారణంగా చూపుతూ.. దేశంలోని వాణిజ్య సిలిండర్ ధరలను పెంచింది. 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.195.50కు పెంచింది. దీంతో కొత్త ధరతో దేశంలో వాణిజ్య సిలిండర్ ధర రూ.2వేల మార్కును దాటింది. ఈ ధరలను ప్రభుత్వ చమురు సంస్థలు సవరించగా.. ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీలో కొత్త ధర రూ.2,078.50కు ఎగబాకింది. కోల్‌కతాలో రూ.2208.50గా, ముంబయిలో రూ.2,031గా, చెన్నైలో రూ.2246.50గా, బెంగళూరులో రూ.2161గా ధరలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.2,320.50కు ఎగబాకింది. డొమెస్టిక్ సిలిండర్ ధరలు, పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ లేదు.భారత్‌లో జెట్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు రెట్టింపు పెరిగి రికార్డు స్థాయికి చేరాయి. మొదటిసారిగా రూ.2 లక్షల మార్కును దాటింది. జెట్ ఫ్యూయల్ (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ -

-మిగతా 2 లో

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ



2 లో

## స్మార్ట్'గా భూ రెవెన్యూ 'సర్వే'

- అన్నదాత అరచేతిలో 'సమీకృత భూభారతి' పోర్టల్
- నేటి నుంచి 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా పోర్టల్ అమలు
- అధికారులకు పొంగులేటి దిశా నిర్దేశం



హైదరాబాద్, :

రోజురోజుకు సాంకేతికత కొత్త రూపును సంతరించుకుంటోంది. గతంలో ఉన్నత విద్యావంతులకే పరిమితమైన టెక్నాలజీ ప్రస్తుతం సామాన్యులు, రైతుల అరచేతిలోనే ప్రత్యక్షమవుతోంది. ఇప్పుడు 'మీ వద్ద స్మార్ట్ ఫోన్ ఉంటే సరి.. మీ భూ వివరాలు' తెలుసుకోవచ్చు.

-మిగతా 2 లో

### అమరావతి బిల్లుకు

## లోక్‌సభ ఆమోదం

- సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపీలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్



న్యూఢిల్లీ, :

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం

-మిగతా 2 లో

mee seva
easier, faster

### భారీగా పెరిగిన

## మీసేవ చార్జీలు

- రేషన్‌కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్‌కు రూ.80
- బర్త్ సర్టిఫికెట్ ప్రింట్, ఈసీకి రూ.62

హైదరాబాద్, :

రాష్ట్రంలో మీసేవ చార్జీలు భారీగా పెరిగాయి. ఇప్పటికే అన్ని విధాలుగా ధరలు పెంచిన సర్కార్ మీసేవ చార్జీలను సైతం వదలలేదు. ఇక నుంచి మీసేవ చార్జీలను భారీగా పెంచారు. దాదాపు 100 శాతం కంటే ఎక్కువగా చార్జీలు పెంచారు. బీ క్యాటగిరీ పరిధిలోని రేషన్‌కార్డు, ఆదాయం, కులం, రెసిడెన్స్, కొత్త విద్యుత్ కనెక్షన్, భూభారతి కేవైసీ వంటి వాటికి ఒకేసారి రూ.80 పెంచారు. మొత్తం 15 రకాల సర్వీసులకు పెంచిన కొత్త చార్జీలు

-మిగతా 2 లో

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

# టచ్‌లో ఉన్నారు

### 25న కొత్త పార్టీని ప్రకటిస్తాం.. ఆ రోజు చేరికలుండవు



- మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మావోయిస్టులు కూడా చేరతారు
- కేసీఆర్ రావణుడైతే.. మరి శకుని ఎవరో రేవంత్ చెప్పాలి
- సీఎం బీఆర్ఎస్ భుజాన తుపాకీ పెట్టి పొంగులేటిని కాల్చారు: కవిత



హైదరాబాద్,

రావణాసురుడు ఉండటం వల్లే రాముడికి, శకుని ఉండటం వల్లే కృష్ణుడికి గుర్తింపు దక్కిందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికరంగా స్పందించారు. కేసీఆర్‌ను రావణుడిగా చెప్పిన రేవంత్, శకుని ఎవరో మాత్రం చెప్పలేదని పేర్కొన్నారు. జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనను తాను మహాభారతంలోని బర్బరీకుడి పాత్రతో రేవంత్ పోల్చుకున్నారని, ఇది తనకు నవ్వు తెప్పిస్తోందని, బర్బరీకుడి మాదిరిగా రేవంత్ చేసిన

-మిగతా 2 లో

## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

మొదటి తరువాయి

ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఒఎ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

మొదటి తరువాయి

పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

## లోక్‌సభ స్థానాల పెంపుపై మోదీ సర్కారు 'బుల్డోజింగ్' యత్నం

మొదటి తరువాయి

ఆందోళనకు కేంద్రం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచడం సమానమనే వాదన మోస పూరితం. దీనివల్ల ప్రస్తుతానికి నిష్పత్తులు మారకపోవచ్చు కానీ, భవిష్యత్తులో విస్మరించలేని లోతైన పరిణామాలు ఉంటాయి. ఉదాహరణకు, ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని ప్రస్తుత 80 సీట్ల నుంచి 120కి పెరుగుతాయి. కానీ తమిళనాడు ఎంపీల బలం 39 సీట్ల నుంచి 59కే పరిమితమవుతుంది. కేరళ లోక్‌సభ సీట్లు 20 నుంచి 30కి పెరిగితే బీహార్ సీట్లు 40 నుంచి 60కి పెరుగుతాయి. మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల్లో కేవలం 66 సీట్లు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలు ఏకంగా 200 సీట్లు పెంచుకుంటాయి' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదన అధికారికంగా బహిర్గతమైతే ఇతరులూ ఆయన్నే అనుసరిస్తారు.' అని ఆయన పేర్కొన్నారు.

## కేంద్రం మరో షాక్



మొదటి తరువాయి

– ఏటీఎఫ్) ధరలు భారీగా ఎగబాకి కిలోలీటర్‌కు రూ.2.07 లక్షలకు చేరాయి. ఇది చరిత్రలోనే అత్యధికస్థాయి పెరుగుదల. ఢిల్లీలో ఏటీఎఫ్ ధరలు రూ.1.10 లక్షలు, అంటే 114.5 శాతం పెరిగాయి. ఇలా ధరలు పెరగడం వరుసగా రెండో నెల. మార్చి 1న కూడా ధరలు 5.7 శాతం పెరిగాయి. కాగా పెరిగిన ఈ ధరల వల్ల విమానయాన సంస్థలకు భారీ భారం పడుతోంది. యుద్ధం కారణంగా కొన్ని ఎయిర్‌స్పేస్‌లు మూసివేయటంతో విమానాలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. విమాన సంస్థల ఖర్చులో సుమారు 40 శాతం వాటా ఇంధనందే ఉంటుంది.పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా విమానయాన రంగం, హౌటల్ రంగం తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. కమర్షియల్ సిలిండర్‌ల కొరత ఉందనీ, దీంతో హౌటళ్లు, రెస్టారెంట్లు ధరలు పెంచుతున్నాయనీ, దాని ప్రభావం పరోక్షంగా సాధారణ ప్రజలపై పడుతోందని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రస్తుతం చమురు ధరలు, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలు పెరగకపోయినా.. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణను దోచుకుంటున్న కాంగ్రెస్

మొదటి తరువాయి

తెలియజేస్తున్నట్లు చెప్పారు. అమరావతి అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 1969లో జై తెలంగాణ అన్నందుకు 369 మంది ఉద్యమకారులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపిందని, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ 1200 మంది ఆత్మబలిదానం చేశారని పేర్కొన్నారు. వారి త్యాగంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ తెచ్చుకున్నారని తెలిపారు. బిల్లుపై చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ సభ్యులు కొందరు తెలంగాణకు విమానాశ్రయాలు లేవని చెప్పారని, ఇందుకు కారణమెవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు విమానాశ్రయాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కొత్తగూడెం, వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాలకు భూమి కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్డీయే ప్రభుత్వం లేఖలు రాసినా.. భూమి ఇవ్వలేదని, కనీసం స్పందించలేదని తెలిపారు. ఇప్పుడు రెండు రాష్ట్రాలను అన్నదమ్ముల్లా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందని, తెలంగాణలోనూ అభివృద్ధి పనులకు అండదండగా నిలుస్తోందని చెప్పారు.

# లక్నోపై ఢిల్లీ క్యాపిటల్స్ సూపర్ విక్టరీ

మొదటి తరువాయి

కూడా ఆ జట్టు బ్యాటింగ్ చేయలేకపోయింది. చివరకు 18.4 ఓవర్లలో 141 పరుగులకు పరిమితమైంది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు తొలి బంతికే షాక్ తగిలింది. కేఎల్ రాహుల్‌ను మహమ్మద్ షమీ.. గోల్డెన్ డకౌట్ చేశాడు.కేఎల్ రాహుల్ ఔట్ అయ్యాక ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే లోపే నాలుగు వికెట్లు కోల్పోయింది. 4.3 ఓవర్లలో 24 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సమీర్ రిజ్వీ .. అసలైన ఆటతీరు కనబరిచాడు. ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.అబేధ్యమైన ఐదో



వికెట్‌కు సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 రన్స్ నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 రన్స్) 76 బంతుల్లో 119 పరుగులు జోడించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 17.1 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లలో కేఎల్ రాహుల్‌తో పాటు అక్షర్ పటేల్ కూడా గోల్డెన్ డకౌట్ అయ్యాడు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2, మహమ్మద్ షమీ 1, మోహ్సిన్ ఖాన్ 1 వికెట్ పడగొట్టారు. ఐపీఎల్ 2026లో భాగంగా గురువారం కేకేఆర్‌తో సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.కాగా 2024లో సమీర్ రిజ్వీని చెన్నై సూపర్ కింగ్స్ భారీ ధర వెచ్చించి దక్కించుకుంది. ఫ్యూచర్ స్టార్‌గా రిజ్వీ మారతాడని అప్పుడే ధోనీ అంచనా వేశాడు. అతడి అంచనాలను నిజం చేస్తూ సమీర్ తాజా మ్యాచులో సత్తాచాటాడు.

# స్మార్ట్'గా భూ రెవెన్యూ 'సర్వే'

మొదటి తరువాయి

సామాన్య రైతుల భూసమస్యల పరిష్కారానికి 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది. గతంలో మాదిరిగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రైతులు 'మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదు' అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇంట్లో నుంచే స్మార్ట్ ఫోన్ ద్వారా భూసేవలు పొందడానికి పోర్టల్ రూపొందించామన్నారు. అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని రైతులు పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని సేవలను పొందవచ్చునని తెలిపారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పారదర్శక సేవలకు వీలుగా ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి రూపొందించిన 'సమీకృత భూ భారతి' పోర్టల్‌ను గురువారం (ఏప్రిల్ 2) నుంచి నారాయణపేట జిల్లా కోస్గి, ఖమ్మం జిల్లా కూసుమంచి, కొత్తగూడెం-భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే.. పోర్టల్ ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రెవెన్యూ అధికారులకు బుధవారం టెలి కాన్ఫరెన్స్‌లో దిశా నిర్దేశం చేశారు. పోర్టల్ నిర్వహణపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ మండలాల నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మార్పులూ చేర్పులతో రెండో దశలో రాష్ట్రమంతా అమలు చేస్తామని వెల్లడించారు.

## అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటి తరువాయి

రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

మొదటి తరువాయి

త్యాగం ఏమిటో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఈనెల 25న కొత్త పార్టీ ప్రకటన ఉంటుందని చెప్పారు. పార్టీ ఎజెండా, ప్రజలకు ఏం చేయదల్చుకున్నామో అదేరోజు వివరిస్తామని చెప్పారు. ఆ రోజు పార్టీలో చేరికలు ఉండవని పేర్కొన్నారు. ఇప్పటికే బీఅర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారన్నారని.. వారి పేర్లు సమయం వచ్చినప్పుడు తానే వెల్లడిస్తానని చెప్పారు. మాజీ మావోయిస్టులు కూడా పార్టీలోకొచ్చి సేవలందిస్తారని పేర్కొన్నారు. కొత్తపార్టీ ప్రకటనకు ముందు ఉమాభారతి లాంటి కొందరు జాతీయస్థాయి నేతలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని వెల్లడించారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలు తిట్టుకోవడానికే సమయం సరిపోయిందని, ఒకరి అవినీతిని మరొకరు బయట పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ బీఆర్ఎస్ పార్టీ భుజాన తూపాకీ పెట్టి మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డిని కాల్చారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుందని, ఆ మేరకు మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాటం చేస్తామని చెప్పారు. కల్వకుర్తి పరిధిలోని కుర్మిద్దలో ప్రభుత్వం పెద్ద భూస్వాములకు చెందిన వందల ఎకరాల భూములను వదిలిపెట్టి.. ఎకరం, అర ఎకరం ఉన్న పేద గిరిజనుల భూములు టీజీఐసీసీ ద్వారా లాక్కునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

**16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు**

**వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ**



న్యూఢిల్లీ, దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

## భారీగా పెరిగిన మీసేవ చార్జీలు

మొదటి తరువాయి

అమలవుతాయి. అలాగే పుట్టిన సర్టిఫికెట్ ప్రింట్, ఈసీ వంటి సర్వీసులకు రూ.62 పెంచారు.వీటి పరిధిలోకి మరికొన్ని సర్వీసులను వర్తింపజేస్తున్నారు. ప్రతి పేజీ స్కానింగ్ కోసం రూ.2.50 అదనంగా వసూలు చేయనున్నట్టు తెలిపారు. పెంచిన ఈసేవ కొత్త చార్జీలు ఈ నెల 1 నుంచే (బుధవారం) నుంచి అమల్లోకి వచ్చినట్టు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లో తెలిపారు. ఇప్పటి వరకు ఈసేవ కనీస చార్జీ రూ.35 వసూలు చేసేవారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నడ్డి విరవడానికే చివరాఖరుకు మీసేవ చార్జీల పెంపును కూడా వదిలిపెట్టలేదు అని వినియోగదారులు మండిపడుతున్నారు.

# శారీరక ఆరోగ్యం, మానసిక అభివృద్ధికి క్రీడలు దోహదం

**-నిర్ధవెల్లి గ్రామంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం**




**కేశంపేట, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేశంపేట మండలం నిర్ధవెల్లి గ్రామంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై, స్థానిక సర్పంచ్ భాస్కర్ గౌడ్ చేతుల మీదుగా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, "శారీరక ఆరోగ్యం, మానసిక అభివృద్ధి, సామాజిక నైపుణ్యాలకు క్రీడలు ఎంతో దోహదపడతాయి. వాలీబాల్ వంటి క్రీడలు ఆడటం వల్ల శరీరం దృఢంగా మారడంతో పాటు రక్తప్రసరణ మెరుగవుతుంది" అని అన్నారు. రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిడదవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్, లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, వీర్లపల్లి సర్పంచ్ పాండు, భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివా యాదవ్, తూర్పుగడ్డ తండా సర్పంచ్ థౌర్యా నాయక్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, నాయకులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, యారం శేఖర్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, యాదయ్య, జంగయ్య, రాంరెడ్డి, సుదర్శన్, నాగరాజు, మురళి, పల్లటి కృష్ణ, సత్యనారాయణ, వార్డు సభ్యులు, గ్రామస్థులు, టోర్నమెంట్ యాజమాన్యం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో పంట మార్పిడి పై అవగాహన సదస్సు



**చిగురాల్‌పల్లి ,ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పరిగి వారు చిగురాల్‌పల్లి గ్రామంలోని రైతు వేదికలో పంట మార్పిడి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. టి. రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, పంట మార్పిడి విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒకే పంటను వరుసగా సాగు చేయడం వల్ల నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో పాటు పురుగులు, తెగుళ్ల సమస్యలు పెరుగుతాయని వివరించారు. పప్పు దినుసుల సాగు వల్ల నేలలో నత్రజని శాతం పెరిగి తరువాతి పంటలకు ఉపయోగపడుతుందని, దీనివల్ల ఎరువుల వినియోగం తగ్గి రైతులకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ మాట్లాడుతూ, పంట మార్పిడి వల్ల కలుపు మొక్కల నియంత్రణ సాధ్యమవుతుందని చెప్పారు. రైతులతో చర్చ జరిపి, పంట మార్పిడి చేయకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. మార్కెట్ సౌకర్యాల లేమి, సరైన అవగాహన లోపం వంటి అంశాలు బయటపడ్డాయి. ఈ కార్యక్రమం ద్వారా రైతులు పంట మార్పిడి ప్రాముఖ్యతను తెలుసుకుని, తమ సాగులో ఈ విధానాన్ని అమలు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.


## క్యాంపు కార్యాలయంలో ఉచిత అంబలి కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**షాద్‌నగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉచిత అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. పేదలకు, ప్రజలకు సేవలు అందించే ఈ కేంద్రం ద్వారా స్థానికులకు మరో సౌకర్యం అందిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. జగన్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షురాలు సబ్య సుల్తానాకు ఎమ్మెల్యే స్వయంగా అంబలి గ్లాసులు అందజేశారు. వారితో కలిసి అంబలి సేవలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), బచ్చలి నరేష్, రాజు నాయక్, దిలీప్, ఖదీర్, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రోడ్డు వేశారు... స్పీడ్ బ్రేకర్లు మరిచారు

**-అతి వేగంతో వాహనాలు- తరచూ ప్రమాదాలు**



**షాద్‌నగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణ థియేటర్ నుంచి కుంట బడి మీదుగా పాత జాతీయ రహదారి వరకు మూడు నెలల క్రితం నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డును విస్తరించి వేయడంతో విశాలంగా మారింది. అయితే ఈ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు అతి వేగంగా వెళ్తున్నాయి. పలు కాలనీల రోడ్లు ఈ మార్గానికి అనుసంధానంగా ఉండటంతో వందలాది వాహనాలు బైపాస్ రోడ్డుగా వినియోగిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలపై యువకులు, కార్లలో ప్రయాణించే వారు వేగంగా దూసుకెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాలేజీ రోడ్డుకు తరువాత అతి పెద్దదైన ఈ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల అవసరం అత్యంత కీలకమని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## జెమ్స్ మోడల్ స్కూల్లో ఘుమఘుమల ఫుడ్ ఫెస్టివల్

**-విద్యార్థుల వినూత్న వంటక ప్రదర్శన**



**పాలకుర్తి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం ఈసాల తక్కళ్లపల్లి గ్రామంలోని జెమ్స్ మోడల్ స్కూల్లో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ ఘుమఘుమల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోగ్యానికి సంబంధించిన పలు రకాల పోషకాహార వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. క్యారెట్ హల్వా, రాగి జావ, అంబలి, జొన్న రొట్టె, గవ్వలు, రవ్వ లడ్డు, పల్లి బట్టి, అరిసెలు, నువ్వుల లడ్డు, సర్వపిండి, పులిహోర, ఆలు బిర్యాని, డ్రై ఫ్రూట్స్ లడ్డు వంటి దాదాపు 70 రకాల వంటకాలు విద్యార్థుల చేతుల మీదుగా సిద్ధమయ్యాయి. "అన్నం పరబ్రహ్మ స్వరూపం. మనం తినే తిండిని వృధా చేయకూడదు. రైతులు కష్టపడి పండించిన పంటలతోనే ఈ వంటకాలు సిద్ధమవుతాయి" అని ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జాలపల్లి మహేష్, హెచ్ఎం జాలపల్లి స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన

**విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం**




**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇంగ్లీషు విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో పుస్తక ప్రదర్శన విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడం, సాహిత్య అవగాహనను విస్తరించడం, విద్యా సంబంధిత చైతన్యాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా జరిగింది. ప్రదర్శనలో క్లాసిక్ సాహిత్యం, ప్రేరణాత్మక జీవిత చరిత్రలు, స్వీయచరిత్రలు, చిన్న కథల పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, స్త్రీవాదంపై ఆధునిక గ్రంథాలు, ఇంగ్లీషు అధ్యయనానికి సంబంధించిన సూచన గ్రంథాలు వంటి విభిన్న రకాల పుస్తకాలు ప్రదర్శించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పాల్గొన్న వారందరికీ, నిర్వాహకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఇంగ్లీషు విభాగం కృతజ్ఞతలు తెలిపింది.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం చేయాలి

**- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి**




**వంగూరు,ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్శించారు. స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, పనులు అనుకున్న గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు మరియు అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పాఠశాల భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులు వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యం ఇస్తోందని, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసనలు



**మర్రిగూడ, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో కార్మికులు నిరసనలు చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి "బ్లాక్ డే"గా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ, "ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలి. లేనిపక్షంలో ఈ పోరాటాలను మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.

## సబ్బుపై వీర హనుమాన్ చిత్రం

**-ఉపాధ్యాయుల వినూత్న ఆరాధన**



**మనోహరాబాద్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హనుమాన్ జయంతి సందర్భంగా మనోహరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మచారి బుధవారం వినూత్న ఆరాధనగా సబ్బుపై వీర హనుమాన్ చిత్రాన్ని చెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రజలందరిపై ఆ భగవంతుని కృపా కటాక్షాలు ఉండాలి" అని ఆకాంక్షించారు. అదేవిధంగా అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న సర్పంచ్ జగత్‌రెడ్డి

**అయ్యవారిపల్లిలో సీసీ రోడ్ల ప్రారంభం**



**ఉప్పునుంతల, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లి గ్రామంలో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న సర్పంచ్ జిల్లెల్ల జగత్‌రెడ్డి సోమవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామ సర్పంచిగా ఎన్నికైన తర్వాత మన అభిమాన నాయకుడు, మన ప్రాంత బిడ్డ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో గ్రామంలో పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనం, మంచి నీటి సరఫరా, పరిశుభ్రత వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇవే కాకుండా ఈరోజు సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఇందిరమ్మ ఇండ్ల విషయంలోనూ, ప్రభుత్వం అందించే అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటాను" అని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా కమిటీ ఎన్నిక


**అధ్యక్షులుగా పిట్ట రమేష్, ప్రధాన కార్యదర్శిగా తూండ్ల రాజయ్య**




**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పిట్ట రమేష్, ప్రధాన కార్యదర్శిగా తూండ్ల రాజయ్యలు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, "టీపీసీసీ సాంస్కృతిక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు ఆదేశాల మేరకు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాం" అని తెలిపారు. కార్యవర్గంలో బుర్రగడ్డ రవి అధ్యక్షుడు, పోలివేణి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు, దాసరి శ్రీనివాస్ కోశాధికారి, పూసాల రమణాచారి ప్రచార కార్యదర్శి, మంద భాస్కర్ యాదవ్ ముఖ్య సలహాదారు, బియ్యన్న తిరుపతి సహాయక కార్యదర్శి, కమేర పద్మ మహిళా విభాగం అధ్యక్షురాలు, కోంద్ర సునీత మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, కన్నూరి రాజయ్య, తాంద్ర మహేష్, భర్ల తిరుపతి కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లాలో జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని, ఆటపాటల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వారు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు, రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు

**-రంగంపల్లి సఖీ సెంటర్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సమగ్ర సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం రంగంపల్లి సఖీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, రిజిస్టర్లను పరిశీలించారు. కౌన్సిలింగ్ పొందుతున్న బాధిత మహిళలు, జంటలతో మాట్లాడి అందుతున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా తక్షణ రిలీఫ్ రావాలి. కేసులపై అధిక శ్రద్ధ వహించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. బాధితులను రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలి" అని సూచించారు. అవసరమైన సందర్భంలో న్యాయ సలహా, కౌన్సిలింగ్ అందించాలని, గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి సఖీ సెంటర్ సేవలను మరింత మంది మహిళలకు చేరవేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్‌కు వినతిపత్రం

**దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ తరఫున ఎంఆర్వోకి సమర్పణ**



**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయుటకు దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ తరఫున బుధవారం ఎంఆర్వోకి వినతిపత్రం అందజేశారు. పోలింగ్ స్టేషన్ వారీగా బీఎల్వోలను ఒకే వేదికపై సమీకరించి మ్యాపింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేయగా, అధికారులు దీనికి సమ్మతించారు. ఇప్పటి వరకు పట్టణంలో 56.9% మ్యాపింగ్ పూర్తి కాగా, మిగతా 43.1% పూర్తి చేయుటకు ప్రజలు తమ పూర్తి సమాచారాన్ని బీఎల్వోలకు అందజేయాలని సొసైటీ సభ్యులు కోరారు. "ప్రజల సహకారంతో పెద్దపల్లి పట్టణంలో 100% మ్యాపింగ్ త్వరలోనే పూర్తి అవుతుంది" అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పేరాల సంపత్ రావు

**రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సోమా పురుషోత్తం నియామకం**





**మహబూబాబాద్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహబూబాబాద్‌కు చెందిన పేరాల సంపత్ రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సోమా పురుషోత్తం నియామకమయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ బుధవారం నియామక పత్రాలను అందజేశారు. గత 35 సంవత్సరాలుగా మెడికల్ వృత్తిలో విశేష సేవలందిస్తూ, ఇటీవల మహబూబాబాద్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంపత్ రావు, జిల్లా కార్యదర్శిగా సోమా పురుషోత్తం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తున్న వీరిని గుర్తించి రాష్ట్ర స్థాయి పదవులకు నియమించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరాల సంపత్ రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సోమా పురుషోత్తం మాట్లాడుతూ, తమ నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. రాజు, రాష్ట్ర కోశాధికారి పి. కృష్ణ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మృత్యుంజయ రెడ్డి, అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.


# అంగన్వాడి కేంద్రములకు టెండర్ ఆహ్వానం

**జిల్లా సంక్షేమ అధికారి సబిత ప్రకటన**



**మహబూబాబాద్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహబూబాబాద్ జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన సదుపాయాల కొనుగోలు కోసం టెండర్ ఆహ్వానం జారీ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 50 అంగన్వాడి కేంద్రాలకు ఆర్ఓ వాటర్ ఫిల్టర్లు, బాల పెయింటింగ్ సామగ్రి కొనుగోలు చేయుటకు ఆసక్తి గల ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖలో రిజిష్టర్డ్ అయిన వ్యాపారస్తుల నుండి టెండర్లు కోరుతున్నట్లు పేర్కొన్నారు. టెండర్లు ఏప్రిల్ 2 నుండి 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో దాఖలు చేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం జిల్లా కలెక్టరేట్‌లోని సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

# యం.కే.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్



**దేవరకొండ, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ పట్టణంలోని యం.కే.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో బుధవారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 20 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఆరుగురు విద్యార్థులు రిలయన్స్ ట్రెండ్స్‌లో ఎంపిక కావడం విశేషం. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను మరెన్నో వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాల-కళాశాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**అధికారులకు సూచించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఉర్దూ మీడియం శిథిలమైన పాఠశాల--కళాశాల అభివృద్ధి పనుల కోసం పలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యా సంస్థల అభివృద్ధి కోసం అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి, పనులు ప్రారంభించాలి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జూవేరియా తబస్సుమ్ సమీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, సీనియర్ నాయకులు నజీర్, మాజీ సర్పంచులు దొండేటి మల్లారెడ్డి, పాప నాయక్, రాజు నాయక్, నాయకులు సురేందర్ రెడ్డి, గిరి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి మండలంలో గ్రామసభలు

**-ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళిక**



**పాలకుర్తి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలంలోని పదహారు గ్రామ పంచాయతీలలో గురువారం గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శశికళ తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగే ఈ గ్రామసభలు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమీక్షించనున్నారు. రాష్ట్ర గీతాలపనతో సభలు ప్రారంభించి గ్రామ సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారానికి ప్రణాళిక రూపొందించి నివేదికలు సమర్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగంపై చర్చించి, 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసే విధంగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించనున్నారు. ఈ గ్రామసభల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులందరూ పాల్గొని సరైన సలహాలు, సూచనలు ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ కోరారు.

# అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆళ్లగడ్డ మండలం పడకండ్ల గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బద్రి సుధాకర్ రెడ్డి, రామ శేఖర్ రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవి/ఎయిడ్స్ నివారణపై సమీక్ష సమావేశం

**-అవగాహన, చికిత్సలో సమన్వయం అవసరం**



**మహబూబాబాద్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో హెచ్‌ఐవి/ఎయిడ్స్ నివారణ, చికిత్స, అవగాహన కార్యక్రమాల పురోగతిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ కలెక్టరేట్‌లోని కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్‌ఐవి పరీక్షలు, ఏఆర్‌టి సెంటర్ల సేవలు, గర్భిణీ స్త్రీలకు హెచ్‌ఐవి స్క్రీనింగ్, వ్యాప్తి నివారణ చర్యలపై సమగ్రంగా చర్చించారు. డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, "హెచ్‌ఐవి నివారణలో అవగాహన అత్యంత కీలకం. ప్రతి ఒక్కరూ సురక్షిత జీవన విధానాలను పాటించాలి. గర్భిణీ స్త్రీలకు తప్పనిసరిగా హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తక్షణ చికిత్స అందించాలి" అని సూచించారు. లింక్ వర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు, కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేసి హెచ్‌ఐవి కేసుల గుర్తింపు, చికిత్సలో శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. యువతలో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కూడా సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అర్జున్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జ్యోతి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె. ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, నీలీమా శ్వేత, ఆశోక్, సారంగం సిఎస్ఓ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల పట్టివేత

**-నిందితులపై కేసులు, బైండోవర్ చర్యలు**




**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన భూతం వెంకటేష్, సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి చెందిన కల్లూరి శ్రీనివాస్ తమ యజమాని కాజా తాజోద్దీన్ ఆదేశాల మేరకు మానేరు వాగు నుండి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డారు. బొమ్మకల్ లారీ అసోసియేషన్ వద్ద పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అనంతరం వారిని ఎమ్మార్వో ముందు హాజరు పరిచి, ఇకపై అక్రమ ఇసుక రవాణా చేయరాదని లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశారు. "ఇకపై అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే సస్పెక్ట్ షీట్లు తెరుస్తాం. ట్రాక్టర్లను కోర్టు లేదా ఎమ్మార్వోకు అప్పగించి వేలం వేస్తాం" అని పోలీసులు హెచ్చరించారు. అదే సమయంలో గోపాల్పూర్ గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్, దాడి శంకరయ్య, దాడి మల్లయ్య భూవివాదాలపై తరచూ తగాదాలు పడుతుండడంతో శాంతిభద్రతల దృష్ట్యా వారిని కూడా ఎమ్మార్వో ముందు హాజరు పరిచి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశారు.

## ప్రజాపాలన--ప్రగతి నివేదిక

**-మాడుగుల మండలంలో గ్రామసభలు**




**మాడుగుల, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న మాడుగుల మండలంలోని 34 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష జరగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామానికి చేరుకునేలా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## సమస్యలపై పోరాడే కమ్యూనిస్టు పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలి

**-ఆర్థిక సహాయం అందించాలని పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**




**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందని, అలాంటి పార్టీకి ప్రజలే వెన్నుదన్నుగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ సీనియర్ నాయకుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏప్రిల్ 1 నుంచి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఇంటింటికి సిపిఐ సామూహిక నిధి, విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం కరీంనగర్ గణేష్ నగర్ కమాన్ చౌరస్తాలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, "సమాజంలో అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా, కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, అన్నదాతలకు అండగా నిలవడం కోసం, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం 1925లో సిపిఐ ఆవిర్భవించింది. అప్పటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలే తమ సమస్యలుగా భావించి పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ" అని అన్నారు. దేశంలో రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణలు, కార్మిక చట్టాలు, ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి అనేక ప్రజా ఉపయోగకర చట్టాలు సిపిఐ పోరాటాల ఫలితమని ఆయన గుర్తుచేశారు. "ప్రజల కోసమే వందేళ్లుగా పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. కార్యాలయాల నిర్వహణ, కార్యక్రమాల కోసం ఆర్థిక సహాయం అందించి పార్టీకి అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బండ రాజిరెడ్డి, చొక్కల్ల శ్రీశైలం, మావురపు రాజు, మచ్చ రమేష్, బావండ్లపెల్లి యుగేందర్, కొట్టె అంజలి, బూడిద సదాశివ, నగర నాయకులు బాకం ఆంజనేయులు, నగునూరి రమేష్, కసిరెడ్డి సందీప్ రెడ్డి, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతులను పండుగలుగా నిర్వహిద్దాం

**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రామ్, ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పెద్దపల్లి జిల్లా జయంతోత్సవాల కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ, "మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి" అని కోరారు. జయంతి రోజున గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రానికి తరలిరావాలని, కమాన్ చౌరస్తా నుంచి కోలాటం, డప్పుసప్పుడులతో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి పల్లె నుంచి ప్రజలు, ప్రజాసంఘాల నేతలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు హాజరై మహనీయులకు ఘన నివాళి అర్పించాలని కమిటీ కోరింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సైతం హాజరుకానున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. "మహనీయుల జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం. వారి చరిత్రను తెలుసుకొని, ఆశయాలను కొనసాగించేలా ముందుకు సాగాలి" అని కమిటీ పిలుపునిచ్చింది. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మామిడిపల్లి బాపయ్య, అంబాల రాజేందర్, ఆరెల్లి మల్లేష్, బొంకూరి కైలాసం, బొంకూరి సురేందర్ సన్నీ, లింగమల్ల శంకరయ్య, కోండ్ర శంకర్, కుక్క కనకరాజ్, తుల్లా నాగరాజ్, బొంకూరి నరేందర్, కల్లేపల్లి రవి, కొంకటి లింగమూర్తి, కల్వల మల్లేష్, పెర్క శివకుమార్, ఈదునూరి విజయ్, కాసిపాక వాసు, కనుకుంట్ల సదానందం, కుక్క శ్రావణ్ కుమార్, బొంకూరి రమేష్, దొమ్మటి సదయ్య, అంబాల నరేష్, పెర్క సతీష్, కల్లేపల్లి అశోక్, రామిళ్ల శారద, బొల్లి స్వామి, కుక్క చంద్రమౌళి, గూల్ల రాజు, సత్యనారాయణ, సలిగంటి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం

**-ఏప్రిల్ 15న పెద్దపల్లిలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్**




**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పెద్దపల్లి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బొంకూరి అవినాష్‌తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, "పార్టీ బలోపేతానికి త్వరలోనే గ్రామ, మండల, అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తాం. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావును కోరాం" అని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు "మత్తు వదలండి -- మైదానంలోకి రండి" అనే నినాదంతో ఏప్రిల్ 15న పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. నియోజకవర్గంలోని క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆయుబ్, కార్యదర్శులు అభినయ్ గౌడ్, కోడపత్రి మధుకర్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రవణ్, మండల అధ్యక్షులు జడల రాజు, సిరిసెటి రాహుల్, ఒర్రె అజయ్ యాదవ్, దేవేందర్ రెడ్డి, నాయకులు అరగొండ రాజ్‌కుమార్, వెలిశాల రాకేష్, రాకేష్ యాదవ్, గుర్రాల వాసు, స్వామి రాజ్ యాదవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య, కొడుకును హత్య చేసిన నిందితుడు అరెస్ట్




**ఆమనగల్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కట్టుకున్న భార్యను, స్వంత కొడుకును హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం, మార్చి 31 రాత్రి ఆమనగల్ మండలం సీతారాం నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పులిగొని పల్లి తండాలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. తండాకు చెందిన బాణావత్ రాందాస్ తన భార్య కవిత (28), కుమారుడు హర్ష రోహిత్ (9)లను రోకలిబండతో తలలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయాల కారణంగా వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ పర్యవేక్షణలో, ఏసీపీ జానకి రెడ్డి మార్గదర్శకత్వంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సీతారాంరెడ్డి మరియు పోలీసు సిబ్బంది నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత





**-విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**
**-- కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహిళల సంక్షేమంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందిస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, "రాంప్ ప్రాజెక్టు క్రింద స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్‌లను ఎంఎస్ఎంఈలుగా మార్చి అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు జరుగుతున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణ సదుపాయాలు కల్పించి మహిళలను ప్రోత్సహిస్తున్నాం. ఉచిత కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి పొందేలా తోడ్పాటు అందిస్తున్నాం" అని తెలిపారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబ పోషణకు తోడ్పడాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 స్వయం సహాయక సంఘాలు, 500 అంకుర సంస్థల అభ్యున్నతి సాధించాలనే సంకల్పంతో పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

**విద్యా–ఆరోగ్య రంగాలపై ప్రత్యేక దృష్టి**

బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, పాఠశాల అభివృద్ధి పనులు, తరగతి గదులు, మూత్రశాలలు, పరిసరాలను పరిశీలించారు. "ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పోషకాహారం, శుద్ధమైన త్రాగునీరు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం" అని ఆయన పేర్కొన్నారు. తహసిల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. బట్వాన్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించి, 99 రోజుల ప్రజాపాలన––ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య పరీక్షలు, ఉచిత మందులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాడీ ఫ్రీజర్ విరాళం

-కొత్తపల్లి గ్రామ ప్రజలకు సేవలో పెరుక మొగిలయ్య కుటుంబం



**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పెరుక మొగిలయ్య కుటుంబం, ఆయన భార్య పెరుక రాజమ్మ జ్ఞాపకార్థం గ్రామానికి బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. ఈ బాక్స్‌ను గ్రామ ప్రజలందరూ ఉచితంగా వినియోగించుకోవచ్చని మొగిలయ్య తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజా సేవలో ముందుండే ఆయన ఈ సేవా కార్యక్రమానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# వేసవికాలంలో జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం

-పోలీస్ కళాబృందం మాటలూ--పాటలతో ప్రజలకు చైతన్యం



**కామారెడ్డి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేసవికాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందం బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మైనర్లు వాహనాలు నడపరాదు, ట్రిపుల్ రైడింగ్ చేయరాదు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, మద్యం సేవించి వాహనాలు నడపరాదు వంటి సూచనలు ప్రజలకు తెలియజేశారు. అలాగే సైబర్ నేరాల నివారణకు టోల్ ఫ్రీ నంబర్ 1930, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 ఉపయోగించాలని, ఓటీపీలు ఎవరికీ చెప్పరాదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగం అత్యంత అవసరమని పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, పీసీలు ప్రభాకర్, సాయిలు మాటలూ--పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు పాల్గొన్నారు.

# కుభ్యతండా పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ

ప్రజా సమస్యలపై చర్చకు పిలుపు




**మాడుగుల, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలంలోని కుభ్యతండా గ్రామపంచాయతీలో నేడు ఉదయం 11 గంటలకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి నేనావత్ దేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గ్రామ సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగనుంది. గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మహిళా సంఘ సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, సిసి, యువతీ--యువకులు పాల్గొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సర్పంచ్ నేనావత్ దేవి, గ్రామ కార్యదర్శి ఈ. శివకుమార్ కోరారు.

# విద్యార్థుల ఎదుగుదల విద్యార్థుల చేతుల్లోనే ఉంది

-ట్రినిటీ కళాశాలలో "ఫైనల్ వేవ్ 2026" ఫేర్‌వెల్ వేడుక



**పెద్దపల్లి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ట్రినిటీ డిగ్రీ మరియు పీజీ కళాశాల ఆధ్వర్యంలో " ఫైనల్ వేవ్ 2026" పేరుతో ఫేర్‌వెల్ వేడుకను పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్లో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రినిటీ వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ట్రినిటీ కళాశాలలో విద్యార్థులకు చదువుతో పాటు లాంగ్వేజ్ స్కిల్స్, పర్సనాలిటీ స్కిల్స్, ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు అందిస్తున్నాం. స్వయం ఉపాధి కోసం హాబీ వర్క్‌షాప్ ద్వారా ఫోటోగ్రఫీ, బ్యూటీషియన్ వంటి శిక్షణలు అందిస్తున్నాం. విద్యార్థులు మంచి ప్రవర్తనతో ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, గురువులు, సమాజానికి గౌరవం తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. నీతా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం. రామ్‌చందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా ఉండి అందరినీ ఆకట్టుకున్నాయి.

# సామాజికవేత్త దూడం నాగభూషణంకు ఉగాది--మహానంది పురస్కారం

-సేవా కార్యక్రమాలతో సమాజానికి ఆదర్శం



**హుస్నాబాద్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజికవేత్త దూడం నాగభూషణంకు ఉగాది--మహానంది జాతీయ పురస్కారం లభించింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇండియా హుస్నాబాద్ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ నాగభూషణంను ఘనంగా అభినందించారు. అనంతరం హుస్నాబాద్‌లో ఆయనకు శాలువాతో సన్మానం నిర్వహించారు. అలయన్స్ క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ, "దూడం నాగభూషణం నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి వెంకటరమణ, గాజుల భగవాన్, వెల్దండి లక్ష్మీపతి, భాస్కర్, చింతకింది శ్రీనివాస్, వెంకటనారాయణ, సాదుల యాదగిరి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో విజయవంతంగా కొనసాగుతున్న అంబలి కేంద్రం

ప్రజలకు ఉపశమనం- దార మోని గణేష్



**కల్వకుర్తి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల ప్రాంగణంలో వేసవిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం ప్రజాదరణ పొందుతోంది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో, ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య సంఘం కల్వకుర్తి సమన్వయంతో ఈ అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు. రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతున్న ఈ కేంద్రం వేసవి ఎండాకాలంలో ప్రయాణికులకు, స్థానికులకు ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. అంబలి సేవలను అందుకుంటున్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 4 లక్షల వ్యయంతో డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభం

-గ్రామీణ విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ సేవలు



**తిమ్మాపూర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామంలోని ఎంపీ యుపిఎస్ ఇస్లాంనగర్ (యు/ఎం) పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభం మరియు మౌలిక సదుపాయాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండ వేణుమూర్తి హాజరై, రిబ్బన్ కట్టింగ్ చేసి ప్రారంభించారు. సీనియర్ సభ్యుడు ప్రకాశ్ హోల్లా, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, డా. భాస్కర్ మడేకర్ చారిటబుల్ ఐ హాస్పిటల్ ట్రస్టీలు, కోల అన్నారెడ్డి, బొమ్మ పావన్, చిదుర సురేష్, తిమ్మాపూర్ ఎంఈఓ వి. శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వసీమ, ఉపాధ్యాయులు, ఏఏపీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధునిక విద్యను ప్రోత్సహించేందుకు కంప్యూటర్లతో కూడిన డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇన్వర్టర్, బ్యాటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, పాఠశాల కార్యకలాపాల కోసం సౌండ్ సిస్టమ్‌ను అందించారు. అదనంగా ఆఫీస్ టేబుల్స్, అల్మిరాలు, ప్రింటర్, వాటర్ ప్యూరిఫైయర్, వాటర్ ఫ్రిజ్, విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంపిణీ చేసిన వస్తువుల మొత్తం విలువ ?4 లక్షలకు పైగా ఉండటం విశేషం. గ్రామ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య ప్రాముఖ్యతను వివరించి, లయన్స్ క్లబ్ సేవలను అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు ముక్క శరత్ కృష్ణ (అధ్యక్షుడు), మయడం శివకాంత్ (కార్యదర్శి), బట్టు వినోద్ (ఖజాంచి) తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం

**విశేష సేవలందించిన నలుగురికి ఘన సత్కారం**




**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన నలుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది.సీసీఆర్బీ నుండి ఎస్సై రాజేశం, స్పెషల్ బ్రాంచ్ నుండి ఎస్సై మహమ్మద్ జమీరుద్దీన్, ఏఆర్ విభాగం నుండి ఏఆర్ ఎస్సైలు యం.డి. ఇక్బాల్, యం.డి. అంకుషావలి పదవీ విరమణ పొందారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, "పోలీస్ ఉద్యోగం అనేక సవాళ్లతో కూడుకున్నది. దానిని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గొప్ప విజయమే. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకం" అని కొనియాడారు.పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ శ్రీనివాస్ జి, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వెల్దండ గ్రామ అభివృద్ధిపై ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**గ్రామ సమస్యలపై చర్చ, సానుకూల స్పందన**



**వెల్దండ, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ అభివృద్ధి అంశాలపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు యెన్నం భూపతి రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో కలిసి గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు.ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పసునోజు వాణి పురుషోత్తమాచారి, ముదికొండ కవిత రమేష్, గుడ్దటి కిష్టల్, మసిగుండ్ల వెంకటేష్, మారేపల్లి మంజుల శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, బొక్కల శ్రీనివాస్, పందెం రమేష్ రెడ్డి, రేవల్లి దర్గయ్య, రేవల్లి రాజు, కూన వెంకటయ్య, జంగిలి ఆనంద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వీర హనుమాన్ విజయ యాత్ర

**-నేడు బజరంగ్ దళ్ భారీ బైక్ ర్యాలీ**




**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హిందూ ఐక్యతను చాటిచెప్పే లక్ష్యంతో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలో నేడు భారీ 'శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర' బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ శోభాయాత్ర సాయంత్రం 4 గంటలకు గాంధీ రోడ్‌లోని వైశ్య భవన్ సమీప రామాలయ దేవస్థానం వద్ద ప్రారంభమవుతుంది. నగరంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగనుంది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ధర్మాచార్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సర్వేశ్వరాంబికా శివయోగి శివాచార్య స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆశీర్వచనాలు అందించనున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, "హిందువులందరూ ఐక్యంగా ఉండి ధర్మరక్షణలో భాగస్వాములు కావాలి. ఈ విజయ యాత్రను దిగ్విజయం చేయడం ద్వారా మన ఐక్యతను చాటుదాం" అని పిలుపునిచ్చారు.భారీ సంఖ్యలో యువకులు, హిందూ బంధువులు పాల్గొనేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. "భారత్ మాతాకీ జై -- జై శ్రీరామ్" నినాదాలతో కరీంనగర్ వీధులు మారుమోగనున్నాయి.విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కరీంనగర్ విభాగం తరపున భక్తులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ విజయ యాత్రను దిగ్విజయం చేయాలని కోరుతున్నారు.

# శాతవాహన యూనివర్సిటీ వీసీకి వినతిపత్రం

**-ఆలయాల పరిరక్షణపై సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్**



**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రజా సమస్యలపై స్పందిస్తూ, గౌతమినగర్ పరిధిలోని పోతుగల్ గ్రామ పెద్దయ్య గుట్టలో ఉన్న పోచమ్మ తల్లి ఆలయం, శివాలయాల పరిరక్షణ అంశంపై శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పూర్వీకుల కాలం నుండి పెద్దయ్య గుట్టపై ఉన్న ఆలయాలు భక్తుల ఆధ్యాత్మిక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జరిగే జాతరలు ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఎడ్ల బండ్లతో జరిగే ఈ జాతరలు గ్రామీణ సంప్రదాయానికి అద్దం పట్టే విశిష్టమైన వేడుకలు" అని వివరించారు.ఇటీవల యూనివర్సిటీ అధికారులు భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కోసం కొలతలు వేయడం, త్రవ్వకాలు చేపట్టడం స్థానికుల్లో ఆందోళనకు కారణమైందని ఆయన పేర్కొన్నారు. "ఆలయాల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను వెంటనే నిలిపివేయాలి. ప్రజల విశ్వాసం, సంప్రదాయాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదు. అవసరమైతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తాం" అని రవీందర్ సింగ్ స్పష్టం చేశారు.వీసీ ఈ విషయంపై సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# కార్మిక హక్కులను హరించే చట్టాలను రద్దు చేయాలి

**-లేబర్ కోడ్ల అమలుపై సిఐటియు నిరసన**



**కల్వకుర్తి, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా లేబర్ అడ్డా వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ ఈ నిరసన చేపట్టారు.సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ, "29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇవి అమలైతే కార్మికుల హక్కులకు భంగం కలుగుతుంది. పని గంటలు పెరగడం, సమ్మె హక్కు కోల్పోవడం, యూనియన్లను రద్దు చేసే అవకాశం పెరుగుతుంది. ఇవన్నీ పెద్ద కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ఉంటాయి" అని పేర్కొన్నారు.అతను ఇంకా మాట్లాడుతూ, "కేరళలో సిపిఎం ప్రభుత్వం లేబర్ కోడ్లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసింది. మన రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అదే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి. అప్పుడు మాత్రమే కార్మిక వర్గానికి మేలు చేసినట్లు అవుతుంది" అని అన్నారు.భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ, "వెల్ఫేర్ బోర్డు నిధులు పక్కదారి మళ్లుతున్నాయి. హెల్త్ చెకప్ పేరుతో కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయి. ఈ నిధులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకూడదు" అని తెలిపారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి యాదయ్య, ఉపాధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, వెంకటేష్, రామస్వామి రాజు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, జంగయ్య, భాస్కర్, హమీద్, ప్రవీణ్ గ్రానైట్స్ అండ్ టైల్స్ హమాలి యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, శ్రీశైలం, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి కుటుంబానికి చేయూత



**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలం సీతారాం నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండాలో కలకలం సృష్టించిన తల్లి, కొడుకుల హత్య ఉదంతంపై ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము విచారం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి తండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మంగళవారం జరిగిన సంఘటన అత్యంత దారుణమైనదని ఆవేదన వ్యక్తం తెలియజేశారు. ఘటనలో గాయపడిన చిన్నారి ప్రణీత ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలో ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆమనగల్లులో కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న చిన్న కూతురు పావనిను ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ.. పిల్లల విద్యాభ్యాసం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. జరిగిన సంఘటన అత్యంత దారుణమైన ఘటన అని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట శ్రీను నాయక్, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు అవగాహన సదస్సు

**-గ్రామసభల నిర్వహణపై సూచనలు**







**వెల్దండ, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామసభలు జరగనున్నాయి. ఈ గ్రామసభల నిర్వహణకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలు, చర్చించాల్సిన అంశాలపై అవగాహన కల్పించేందుకు వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమావేశం జరిగింది.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు మండలంలోని 32 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.రేపటి గ్రామసభలో సంబంధిత శాఖల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు, ఇంకా మంజూరు కాని లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించాలని సూచించారు. గ్రామసభ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ సమావేశంలో మండల తహసిల్దార్ కార్తీక్ కుమార్, మండల విద్యాధికారి చంద్రుడు, ఎంపీఓ లక్ష్మణ్, ఎంపీడీవో ఆఫీస్ పర్యవేక్షకులు మోహన్ లాల్, ఇతర శాఖల అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారమే లక్ష్యం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**





**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం గానుగుమర్ల తండా గ్రామపంచాయితీ ఉప సర్పంచ్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ ఆధ్వర్యంలో కనుగుబయి తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ పేదలకు ఇళ్లు మంజూరు చేసిన దాఖలాల్లేవన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి బిక్యా నాయక్, డైరెక్టర్ నరేష్ నాయక్, సర్పంచ్ సేవ్యా నాయక్, మాజీ సర్పంచ్ హంష మోత్య నాయక్, డిప్యూటీ సర్పంచ్ హీరా సింగ్, మాజీ డిప్యూటీ సర్పంచ్ పాండు నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజు నాయక్, వార్డు సభ్యులు గోపి నాయక్, రాజు, శ్రీను, నాగార్జున, సీనియర్ నాయకులు మోత్య, రాజు, లక్ష్మణ్, పత్య, హరిలాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సంపూర్ణ ఆరోగ్యానికి అంగన్వాడి కేంద్రాల సేవలు**





పౌష్టిక ఆహారం పిల్లల బరువులు చూస్తున్న సర్పంచ్ ప్రవీణ్

**ఎలిగేడు, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ సూచించారు.ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం--3లో విహెచ్ఎస్ఎన్ఆ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిల్లల బరువులు, ఎత్తులను పరిశీలించారు. బాలమృతం, కోడిగుడ్లను పంపిణీ చేశారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందేలా చూడాలని సర్పంచ్ సూచించారు.కేంద్రంలోని రిజిస్టర్లు, స్టాక్ వివరాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సరోజ, వార్డు సభ్యులు కవ్వంపల్లి సాయి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి శిక్ష విధించిన కోర్టు



**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనం నడిపిన శివాజీనగర్‌కు చెందిన నెదునూరి రమేష్ (42)ను పోలీసులు పట్టుకున్నారు. కేసును విచారించిన ప్రత్యేక జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఈదుల లక్ష్మి, నిందితుడికి రూ.4,000 జరిమానా విధించడంతో పాటు మూడు రోజులపాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సామాజిక సేవ చేయాలని ఆదేశించారు.నిందితుడి పనితీరును ఎస్‌హెచ్‌ఓ పర్యవేక్షించి కోర్టుకు నివేదించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# పులిగోనిపల్లి తాండలో జరిగిన సంఘటన విచారకరం

- డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్
- తల్లి లేని చిన్నారులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది
- గంప వెంకటేష్, లక్ష్మీ నర్సింహా రెడ్డి, శీను నాయక్ పార్టీ పరంగా రూ.20వేల ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం సీతారాం నగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండాలో మంగళవారం జరిగిన సంఘటన చాలా బాధాకరమని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. తండ్రి బాణావత్ రాందాస్ తాగుడుకు బానిసై కట్టుకున్న భార్య కవిత, కుమారుడు హర్షవర్ధన్ ను దారుణంగా హత్య చేయడం కూతురు ప్రణీత చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని వారన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం సభ్య సమాజంలో మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. అనాధలైన ఇద్దరు ఆడపిల్లలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి రూ. 10, 000 వేలు, డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా రూ. 5, వేలు రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్ రూ. 5, వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారికి భవిష్యత్తులో ఎటువంటి కష్టం వచ్చినా చిన్నారులకు పార్టీ తరఫున అండగా నిలుస్తామని చేయూత అందించారు. కార్యక్రమంలో నార్లకుంట సర్పంచ్ రామ్ చందర్ నాయక్, సీనియర్ నాయకులు జోగు వీరయ్య, లాయక్ అలీ, బద్రి మహేష్, హెమ్ లాల్ బావోజి, రాయ కంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం దైవ నామస్మరణ చేయాలి



**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతి వ్యక్తి నిత్యం దైవ నామస్మరణ చేయడంతో పాటు దేవాలయాలను సందర్శించాలని ఉమ్మడి మహబూబ్ నగర్ డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహా రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ దోణదుల కుమార్ ఆధ్వర్యంలో హనుమాన్ ఇరుముడి పూజా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి గంప వెంకటేష్ గుప్తా, సింగల్ విండో వైస్ చైర్మెన్ దోనాదుల సత్యం, ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఎనుమల రమేష్, ఎంగలి భాగ్యలక్ష్మి రఘు, లక్ష్మీ నర్సింహా రెడ్డి, రాంనుంతల సర్పంచ్ శ్రీను నాయక్, రామ్ చందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపతి హోమం, ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్త మాట్లాడుతూ.. హనుమాన్ మాలధారులు మండల దీక్ష 41 రోజు కఠిన నిష్ట తరువాత స్వామికి సమర్పించే పవిత్రమైన సమర్పణ ఇరుముడి జరుగుతుందని అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు విదేశీయులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, మన దేవతలను విదేశాల్లో ఆరాధిస్తున్నారని, ఈ విషయాన్ని మనం గ్రహించాలన్నారు. దైవనామ స్మరణతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, కష్టాలు దూరం అవుతాయని, ఇందుకు పురాణ గాధలు నిదర్శనమని తెలిపారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో నిత్యం దూప, దీప, నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తూ.. ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామస్తులను గంప వెంకటేష్ అభినందించారు. అనంతరం ఆంజనేయ స్వామి భక్తులు మాలధారులు పెద్ద ఎత్తున హాజరై ఇరుముడి కట్టుకున్నారు. ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రనాయక్, ఉప సర్పంచ్ శ్రీను, నాయకులు మాజీ సర్పంచులు జోగు వీరయ్య, లాలయ్య, సుక్కమ్మ, లాయక్ అలీ, రాయకంటి సురేష్, శ్రీను, హేమ్లా బావోజి, గన్యా నాయక్, బద్రి నాయక్, మహేష్ గౌడ్, శాంతి లాల్ తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తాం





**- అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్**

**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు బార్ అసోసియేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని జూనియర్ కోర్టులోని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జ స్వరూప కాటం హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండవసారి ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అండేకార్ యాదిలాల్, ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ సెక్రెటరీ కానం గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్ లు నూతన కార్యవర్గంగా ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గ కార్యక్రమానికి సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు హాజరై పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన అండేకార్ యాదిలాల్ మాట్లాడుతూ.. బార్ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రతి న్యాయవాది సమస్యలను పరిష్కరించడానికి తమవంతు పాటు పడుతామని పేర్కొన్నారు. తమకు ఓటేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా నూతన కోర్టు ఏర్పాటు కోసం, స్థల సేకరణ, కోర్టు నూతన భవన నిర్మాణం అదేవిధంగా సీనియర్ కోర్టు షాద్ నగర్ నుండి మహేశ్వరం కోర్టుకు వచ్చేటట్లు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని యాదిలాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్, వెంకట్ గౌడ్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, రామకృష్ణ, కొప్పు కృష్ణ, మల్లేష్, జగన్ గౌడ్, మహేశ్వర్, నరేందర్, ప్రభు నాయక్, బీక్యనాయక్. రమేష్, శివ శంకర్, శ్రీశైలం, మహేష్, శ్రీనివాస్, శిరీష, శైలజ, ప్రియాంక, సునీత, మమత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, సూపరిడెంట్ మురళీధర్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించాలి

**పశువుల ఆరోగ్యానికి పశుసంవర్ధక శాఖ చర్యలు**



**ఎలిగేడు, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించుకోవాలని మండల పశువైద్యాధికారిణి ఝాన్సీ సూచించారు. ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని 182 పశువులకు గాలికుంటు టీకా వేశారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారం రాయమల్లు, పంచాయతీ కార్యదర్శి శిరీష, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.


# ఆమనగల్లులో ప్లకార్డులతో నిరసన



**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కేంద్ర పభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని బాపూజీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మిక వ్యతిరేకమని ఇవి అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత తగ్గి, సంఘాల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మేదరి శ్రీను, జంగయ్య, లాలయ్య, నరసింహ, చంద్రయ్య, ఎల్లయ్య తదితరులున్నారు.

# ఉత్సవాలకు రేణుక ఎల్లమ్మ ఆలయం ముస్తాబు

**-వైభవంగా జరగనున్న జమదగ్ని కళ్యాణ మహోత్సవాలు**


నర్సాపూర్ ముస్తాబైన రేణుక ఎల్లమ్మ నూతన దేవాలయం

**ఎలిగేడు, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయం ముస్తాబైంది. ఈ నెల 3న శుక్రవారం ఉదయం శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా జరగనుంది. అనంతరం 5న ఆదివారం పోచమ్మ బోనాలు, 6న పుట్టకు దానిపోయిట, జోగు తిరుగుట, సాయంత్రం లందకాడికి పోవుట పుట్ట కార్యక్రమం, 7న ఎల్లమ్మ బోనాలు, పట్నాలు, 8న కళ్యాణం వంటి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గౌడ సంఘం నిర్వాహకులు మాట్లాడుతూ, "ప్రతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ వైభవంతో జరుగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తల్లి ఆశీస్సులు పొందాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.

## మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ పత్రికా సోదరుడి కూతురు నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న విలేకరులు

**మంథని, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంథని పట్టణంలోని మహాలక్ష్మి దేవాలయంలో బుధవారం రోజున డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రత్యక్ష సాక్షి రిపోర్టర్, సోదరుడు మంథని లక్ష్మణ్ ప్రథమ పుత్రిక రిషిత, ప్రవీణ్ వివాహ నిశ్చితార్థ వేడుకల్లో భాగంగా డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ విలేకరులు అందరూ పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న రిపోర్టర్ లు కొడారీ మల్లేష్ యాదవ్, మహావాది సతీష్ కుమార్, చేరాల రవీందర్, మాదేశి శ్రావణ్ కుమార్, రామడుగు సాయి, శ్రీనివాస్, ఏగోలపు సంతోష్ గౌడ్, మాటేటి కుమార్, దార మధు, రాజు, కాసర్ల శంకర్, కాసిపేట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

# ఆమనగల్లులో నేడు వార్డు సభలు

**- మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్**

**ఆమనగల్లు, ఏప్రిల్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సభల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు వెల్లడించడంతో పాటు స్థానిక సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించాలని




ఆదేశించారు. ప్రజలందరూ ఈ సభల్లో పాల్గొనాలని కోరారు.

**గ్రామ, వార్డు సభలు.. ప్రభుత్వ సూచనలు**

1) ఉ.10గంటలకు రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ' ఆలపించి, సభను ప్రారంభించాలి.
2) గ్రామసభలో సర్పంచ్ తో పాటు పాలకవర్గం, వార్డు సభలో మున్సిపల్ ఛైర్మన్ తో పాటు పాలకవర్గం, అధికారులు, ప్రజలు హాజరుకావాలి.
3) సీఎం సందేశాన్ని చదివి వినిపించాలి.
4) ప్రభుత్వ విజయాలు, 6 గ్యారంటీలపై అవగాహన కల్పించి, పథకాలకు అర్హులను గుర్తించాలి.
5) ప్రజాసమస్యల కోసం ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలి.. పరిష్కారాలపై కార్యాచరణ రూపొందించాలి.

# గ్రామీణ స్థాయి కార్మికులకు పని కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

**ఉపాధి హామీ పథకం బలోపేతం చేయాలని కాంగ్రెస్ డిమాండ్**



**మహబూబాబాద్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న కూలీలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్య ఉమ మురళీ నాయక్ కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "గ్రామీణ పేదల జీవనాధారంగా నిలిచిన ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరు కొనసాగించడం ఎంతో అవసరం. కాంగ్రెస్ పార్టీ 2005లో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాలి. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిధులు తగ్గించడం, వేతనాల ఆలస్యం చేయడం వంటి చర్యల ద్వారా కార్మికులను మోసం చేస్తోంది. మహాత్మా గాంధీ పేరును తొలగించి వీబ్ జీ రామ్ పెట్టడం సరైనది కాదు" అని పేర్కొన్నారు. ఆమె ఇంకా మాట్లాడుతూ, "గ్రామీణ కార్మికులకు పూర్తి స్థాయిలో పని కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. 100 రోజులపాటు ఉపాధి కల్పించి, సమయానికి వేతనాలు చెల్లించాలి. పథకాన్ని బలోపేతం చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముడుపుగల్ గ్రామ సర్పంచ్ కొత్త హేమంత్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాం రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కెకెసి అధ్యక్షుడు సల్వాది దిలీప్, కౌన్సిలర్లు బోడ రవి, అంబాల శివకుమార్, యూత్ నాయకులు మిట్టకంటి నరేష్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఆయూబ్ ఖాన్, పట్టణ నాయకులు రియాజ్, మాజీ సర్పంచ్ రామన్న, వార్డు మెంబర్ గద్దల యాకన్న, బాషికాల రాజి రెడ్డి, సురుగు రంగయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు, ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

**కరీంనగర్‌లో 70 వాహనాలు సీజ్**




**కరీంనగర్, ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




ఆదేశాల మేరకు బుధవారం నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ పర్యవేక్షణలో ముమ్మర తనిఖీలు జరిగాయి. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సరైన నెంబర్ ప్లేట్లు లేని, నెంబర్లు స్పష్టంగా కనిపించని, ట్యాంపరింగ్ చేసిన 70 ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలకు వెంటనే నెంబర్ ప్లేట్లు అమర్చించి, సంబంధిత వాహనదారులపై భారీ జరిమానాలు విధించారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మాట్లాడుతూ, "కొంతమంది ఉద్దేశపూర్వకంగానే నేరాలకు పాల్పడాలనే ఆలోచనతో లేదా చలానాలనుండి తప్పించుకోవడానికి నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ప్రతి వాహనానికి స్పష్టంగా కనిపించే నెంబర్ ప్లేట్ తప్పనిసరి. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు కనిపిస్తే సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. అలాగే వాహనదారులు రవాణా శాఖ నిబంధనల ప్రకారం హెచ్‌ఎస్‌ఆర్‌పి నెంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని సూచించారు. నెంబర్లపై స్టిక్కర్లు వేయడం, నెంబర్లను మార్చడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలు నడిపే వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉన్నాయో లేదో గమనించాలని కోరారు. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆమనగల్లులో ఎమ్మెల్యే పర్యటన

**ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి భూముల పరిశీలన**



**ఆమనగల్లు, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ఆమనగల్లు పట్టణంలో బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మండలంలో నిర్మించ తలపెట్టిన పలు ప్రభుత్వ కార్యాలయాల కోసం అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయం, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం, పోలీస్ బెటాలియన్ కేంద్రం, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, జూనియర్ సివిల్ కోర్టు, అగ్నిమాపక కేంద్రం, స్టేడియం నిర్మాణం, డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం అనువైన స్థలాలను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని భూముల ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ ఫాహీం ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, మున్సిపల్ ఛైర్మన్ నేనావత్ పత్యానాయక్, ఏఎంసీ ఛైర్మన్ యాట గీత, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు యాట నర్సింహ్మ, జగన్, మానయ్య, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, పార్టీ సీనియర్ నాయకులు విజయ్ నాయక్, వగ్గు మహేష్, మెకానిక్ బాబా, వస్పుల శ్రీశైలం, కృష్ణ నాయక్, వస్పుల శ్రీకాంత్, కొండల రెడ్డి, కాలే మల్లయ్య, ఫరీద్, ఖాదర్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె ఎంపీపీ పాఠశాలను ఎంపీడీవో నూర్జహాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, బోధన, మధ్యాహ్న భోజనం అమలును ఆమె పరిశీలించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు.
అనంతరం గ్రామంలో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలని అధికారులను ఆదేశించారు.

# బిజినెస్

## జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు..

### మార్చిలో రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ ఇన్‌కమ్




దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్లు సరికొత్త రికార్డు నెలకొల్పాయి. భారీగా పన్ను వసూళ్లు జరగడంతో ఈ మార్చి నెలలో జీఎస్టీ ఆదాయం (+ూ అఅఎశీఎవ) తొలిసారిగా రూ.2 లక్షల కోట్లు దాటింది. బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. మార్చిలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.2,00,064 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1,83,845 కోట్లతో పోలిస్తే ఇది 8.8 శాతం అధికం కావడం గమనార్హం.దేశీయంగా స్థిరమైన ఆదాయంతోపాటు దిగుమతులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ.1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే ఇది 8.2 శాతం ఎక్కువ. మొత్తం 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.22.27 లక్షల కోట్లకు చేరాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఇవి రూ.20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థికవ్యవస్థ పటిష్ఠంగా ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 7 శాతం జీడీపీ వృద్ధితో ముందుకు సాగుతున్న తరుణంలో జీఎస్టీ వసూళ్లు కూడా అదే స్థాయిలో పెరగడం శుభపరిణామమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు...

### సెన్సెక్స్ 1,186 పాయింట్లు, నిఫ్టీ 348 పాయింట్లు లాభం



భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల బాటలో నడిచాయి. సెన్సెక్స్, నిఫ్టీ భారీగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 1186.77 పాయింట్లు (1.65 శాతం) లాభపడి 73,134.32 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా 348 పాయింట్లు (1.56 శాతం) లాభపడి 22,679.40 పాయింట్ల వద్ద ముగిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి రోజు మార్కెట్లు లాభాలబాటలో నడవడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. ఇరాన్ వార్‌ను త్వరలోనే ముగిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం మార్కెట్ వర్గాలకు కలిసొచ్చింది.బ్యాంకింగ్, కెమికల్స్, మీడియా, మెటల్స్ షేర్లు ఈ రోజు లాభాల్లో కొనసాగాయి. బుధవారం ఉదయం ప్రారంభం నుంచే స్టాక్ మార్కెట్ లాభాల్లో నడిచింది. ఒక దశలో సెన్సెక్స్ ఏకంగా 1850.51 పాయింట్లు పెరిగి 73,801.07 వద్ద, నిఫ్టీ 563.95 పాయిట్లు పెరిగి 22,895.35 వద్ద కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.70 వద్ద కొనసాగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 2 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 1.6 శాతం, లార్సన్ అండ్ టర్బో షేర్లు 3.4 శాతం పెరిగాయి. ఇక ఇండిగో ఎయిర్‌లైన్స్ షేర్లు ఏకంగా 6.7 శాతం పెరగడం విశేషం. సంస్థ సీఈవోగా ఇండస్ట్రీ వెటరన్ విల్లీ వాల్ష్ నియామకం ఇందుకు కలిసొచ్చింది. ఇండియన్ మార్కెట్‌తోపాటు ఆసియన్ మార్కెట్లు కూడా లాభాల్లోనే నడిచాయి.ఆసియన్ మార్కెట్లు 4.6 శాతం లాభాల్లో నడవగా, యూరప్ స్టాక్స్ 600 కూడా 2.3 శాతం లాభపడింది. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 101 డాలర్లకు చేరింది. గత నెలలో భారత మార్కెట్లు భారీగా నష్టపోయాయి. మొత్తంగా గత మార్చిలో 11 శాతం వరకు నష్టాలు చవిచూశాయి. గత ఆరేళ్లలో ఒక నెలలో ఈస్థాయి నష్టాలు రావడం ఇదే మొదటిసారి. ఇరాన్ యుద్ధం కారణంగానే మార్కెట్ ఈ స్థాయిలో నష్టపోయింది.

## మళ్లీ సీన్ రివర్స్.. భారీగా పెరిగిన బంగారం ధరలు..

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరి పరుగులు పెడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో బంగారం, వెండి ధరలు నాన్‌స్టాప్ పెరుగుతున్నాయి. అయితే.. ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వచ్ఛమైన పసిడి ధర ఏకంగా లక్షా 60 వేల మార్క్ .. మళ్లీ తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలోనే.. మళ్లీ బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. బుధవారం ఉదయం నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి.

**-24 క్యారెట్ల బంగారం 10 గ్రాములపై రూ.1,970 పెరిగి.. రూ.1,51,480 కి ఎగబాకింది.**

**22 క్యారెట్ల గోల్డ్ పది గ్రాముల ధరపై రూ.1,800 లు పెరిగి.. రూ.1,38,850 గా ఉంది.**



వెండి కిలో ధర రూ.2,64,900 గా ఉంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,480, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,38,850 ఉంది. వెండి కిలో ధర రూ.2,55,000 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,51,480, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,38,850 ఉంది. వెండి కిలో ధర రూ.2,55,000 ఉంది.

-ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,51,630, 22 క్యారెట్ల ధర రూ.1,39,000 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,55,000 ఉంది.

-ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,51,480, 22 క్యారెట్ల ధర రూ.1,38,850 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,55,000 లుగా ఉంది.

-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,53,270, 22 క్యారెట్ల ధర రూ.1,40,500 ఉంది. వెండి కిలో ధర రూ.2,65,000 లుగా ఉంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,51,480, 22 క్యారెట్ల ధర రూ.1,38,850 ఉంది. వెండి కిలో ధర రూ.2,55,000 లుగా ఉంది.


## అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్



పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఓ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా మంగళవారం గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ లాంగెస్ట్ ఓవర్ వేసి అందరిని ఆశ్చర్యపరిచాడు. గుజరాత్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. ఒక ఓవర్‌లో 6 బంతులు వేయాల్సి ఉండగా.. ఏకంగా 11 బంతులు వేసి చెత్త రికార్డును నమోదు చేశాడు.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 19 ఓవర్లు పూర్తయ్యే సరికి 6 వికెట్ల నష్టానికి 150 రన్స్ చేసింది. క్రీజులో షారుఖ్ ఖాన్, రాహుల్ తెవాటియా ఉండగా.. 20వ ఓవర్‌ను అర్ష్‌దీప్ సింగ్ వేశాడు. అయితే మొదటి బాల్‌ని వైడ్‌గా వేశాడు. ఆ తరువాత వరుసగా రెండు బాల్స్ వేయగా.. పరుగులు ఏమీ రాలేదు. అయితే.. మూడో బాల్‌కి రాహుల్ తెవాటియా ఫోర్ కొట్టడంతో అర్ష్‌దీప్ సింగ్ గతి తప్పాడు. ఇక ఫోర్త్ బాల్‌ని నో బాల్‌గా వేసిన అర్ష్‌దీప్ సింగ్.. ఆ తరువాత వరుసగా రెండు బాల్స్ వైడ్‌గా వేశాడు. నాలుగో బాల్‌కి పరుగులు రాలేదు. ఐదో బాల్‌కి సింగిల్ రాగా ఆఖరి బాల్‌ని వైడ్‌గా వేశాడు. మళ్లీ ఆరో బాల్ వేయగా ఈ సారి పరుగులు ఏమీ రాలేదు. ఓవర్ త్రోను కలుపుకుని మొత్తంగా ఈ ఓవర్‌లో 12 పరుగులు వచ్చాయి. అయితే ఐపీఎల్ చరిత్రలో ఇలా లాంగెస్ట్ ఓవర్‌ను వేసింది అర్ష్‌దీప్ సింగ్ ఒక్కడే కాదు. మరో ఐదుగురు బౌలర్లు ఉన్నారు. 2023లో మహ్మద్ సిరాజ్ ముంబై పై, 2023తో తుషార్ దేశ్ పాండే లక్నోపై, 2025లో శార్దూల్ ఠాకూర్ కేకేఆర్ పై, 2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై సందీప్ శర్మ, 2025లో గుజరాత్ టైటాన్స్‌పై హార్దిక్ పాండ్యాలు కూడా ఒక ఓవర్‌లో 11 బాల్స్ వేశారు. అర్ష్‌దీప్ సింగ్ చెత్త రికార్డును నమోదు చేసినప్పటికి కూడా పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.


# స్పోర్ట్స్

## స్లో ఓవర్ రేట్.. శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల ఫైన్




**ముల్లాన్‌పూర్:**
ఐపీఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో విక్టరీ సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కు జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి 12 లక్షల ఫైన్ వేశారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద ఈ సీజన్ తొలి నేరంగా పరిగణిస్తూ .. స్లో ఓవర్ రేటు కింద అయ్యర్‌కు జరిమానా విధిస్తున్నట్లు ఐపీఎల్ తన ప్రకటనలో తెలిపింది.ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసి విజయంతో టైటిల్ వేటను మొదలెట్టింది పంజాబ్ జట్టు. గిల్ సేన నిర్దేశించిన 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కింగ్స్.. 19.1 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి గెలుపు బోణీ కొట్టింది. ఈ లీగ్‌లో అరంగేట్ర మ్యాచ్ ఆడిన కూపర్ కనోలి (44 బంతుల్లో 72 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్సలు) అర్ధశతకానికి తోడు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37, 1 ఫోర్, 4 సిక్సలు) రాణించారు. పంజాబ్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టైటాన్స్.. బ్యాటర్ల వైఫల్యంతో 20 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ గిల్ (27 బంతుల్లో 39, 6 ఫోర్లు), జోస్ బట్లర్ (33 బంతుల్లో 38, 3 ఫోర్లు, 2 సిక్స్) మినహా మిగిలినవారంతా తేలిపోయారు.

## గ్లెన్ మాక్స్‌వెల్‌కు నిరాశే



క్రికెట్ ఆస్ట్రేలియా 2026-27 సంవత్సరానికి సంబంధించి సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో స్టార్ ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌తో పాటు మాట్ రెన్‌షా, ఫాస్ట్ బౌలర్ జై రిచర్డ్‌సన్, యువ బ్యాటర్ సామ్ కాన్స్టాస్, ఫాస్ట్ బౌలర్ లాన్స్ మోరిస్, ఆల్‌రౌండర్ మాథ్యూ షార్ట్‌లను కాంట్రాక్ట్ లిస్ట్ నుంచి తప్పింది. క్రికెట్ ఆస్ట్రేలియా మొత్తం 21 మంది ఆటగాళ్లకు ఈ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో అవకాశం ఇచ్చింది. యాషెస్ సిరీస్‌లో అద్భుతంగా రాణించిన మైఖేల్ నెసర్ ఆస్ట్రేలియా కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు సంపాదించుకున్నారు. నెసర్‌తో పాటు బ్రెండన్ డాగెట్, ఆఫ్ స్పిన్నర్ టాడ్ మర్ఫీలకు కూడా అవకాశం ఇచ్చారు. యాషెస్ సిరీస్‌లో ట్రావిస్ హెడ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన జాక్ వెదరాల్డ్ కొన్ని మంచి ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతనికి సెంట్రల్ కాంట్రాక్ట్ లభించడంతో, ఓపెనర్‌గా అతనికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వెదరాల్డ్ డొమెస్టిక్ క్రికెట్‌లో టాస్మానియా తరపున ఆడుతూ కూడా అద్భుతమైన ఫామ్‌తో పరుగులు సాధించాడు. జై రిచర్డ్‌సన్‌ను తప్పించడం ఆసక్తికరంగా మారింది. భుజానికి శస్త్రచికిత్స తర్వాత సుదీర్ఘ క్యాంప్ ముగించుకుని టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చి మెల్‌బోర్న్‌లో ఇంగ్లాండ్‌తో ఆడాడు. రిచర్డ్‌సన్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా జట్టు సహచరుడు మోరిస్ కాంట్రాక్ట్ ముగిసింది. అతను గత ఆగస్టు నుండి వెన్నునొప్పి, సర్జరీ కారణంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. గత ఏడాది మధ్యలో వెస్టిండీస్ పర్యటన తర్వాత టెస్ట్ జట్టు నుండి తప్పుకున్న కాన్స్టాస్ కాంట్రాక్టును పొడిగించలేదు. మాట్ రెన్‌షాకు కూడా ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు దక్కలేదు.షెడ్యూల్, జట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను సిద్ధం చేసినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రధాన సెలెక్టర్ జార్జ్ బెయిలీ తెలిపారు. వచ్చే 12 నెలల్లో దక్షిణాఫ్రికా, భారత్, ఇంగ్లాండ్‌లతో సిరీస్‌లు ఆడాల్సి ఉందని, అలాగే స్వదేశీ సిరీస్‌లు కూడా ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లే కాకుండా ఇతర ఆటగాళ్ల అవసరం కూడా తమకు ఉంటుందని, వారిని కూడా వినియోగించుకుంటామని బెయిలీ స్పష్టం చేశారు.

క్రికెట్ ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్టులో ఉన్న ఆటగాళ్లు

స్కాట్ బోలాండ్, అలెక్స్ క్యారీ, పాట్ కమిన్స్, జేవియర్ బార్ట్లెట్, బ్రెండన్ డాగెట్, నాథన్ ఎల్లిస్, కామరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబుషేన్, నాథన్ లియోన్, మిచెల్ మార్ష్, మాథ్యూ కుహ్నెమాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, టాడ్ మర్ఫీ, మైఖేల్ నెసర్,జాక్ వెదరాల్డ్, బ్యూ వెబ్‌స్టర్, ఆడమ్ జంపా.